క్లుప్తంగా

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని విశాఖపట్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు తేదీని అధికారులు మరోసారి పొడిగించారు. తొలుత మార్చి 6 వరకు గడువు ఉండగా, తర్వాత దానిని ఏప్రిల్ 6కు మార్చారు. తాజాగా ఏప్రిల్ 13 వరకు దరఖాస్తు గడువు ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ శాంతకుమారి తెలిపారు. 5వ తరగతిలో 80, ఇంటర్‌లో 80 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో https://apbragcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.4.28 లక్షలు



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో సురేష్‌బాబా

తగరపువలస: సంగివలస పోలమాంబ (ముగ్గురు అమ్మవార్ల) ఆలయ హుండీలను మంగళవారం లెక్కించగా రూ.4,28,831 లభించింది. ఈ ఆదాయం 29 రోజులకు సంబంధించిందని ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. ఈ లెక్కింపునకు ఇన్‌స్పెక్టర్‌గా రాజగోపాలరెడ్డి వ్యవహరించగా అర్చకుడు ఏడిద రామకృష్ణశర్మ పాల్గొన్నారు.

నృత్య కళాకారిణి అపర్ణకు అభినందనలు



కూచిపూడి నృత్య కళాకారిణి అపర్ణ

మధురవాడ: ప్రముఖ కూచిపూడి కళాకారిణి ఎస్ఎస్‌వీ అపర్ణ నారీశక్తి పురస్కారానికి ఎంపిక కావడంతో ఆమెను పలువురు అభినందించారు. న్యూఢిల్లీకి చెందిన దూస్రా దశక్ ఫౌండేషన్ వచ్చే నెల 27న ప్రముఖ సినీ నటి, నర్తకి మయూరి సుధాచంద్రన్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోనున్నారు. మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన ఆమె ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాల్లో 500 వరకు కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్నారు. ఇటీవల బెంగళూరులో సౌత్ ఇండియా ఉమెన్ ఎచీవర్స్ అవార్డును కైవసం చేసుకుని అందరి మన్ననలను పొందారు.


ఘనంగా సాగర దుర్గ ఉత్సవం



అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్దిలో సాగర దుర్గ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. షరాబుల వీధిలో నుంచి అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా మద్ది జంక్షన్‌లో ఉన్న ఆలయంలోకి తీసుకువెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఆలయ ధర్మకర్త బుగత సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. చిడతలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మహాత్మా... మన్నించు



మహాత్ముని పెయింటింగ్ వద్ద పేరుకుపోయిన చెత్త

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సచివాలయం–1, 2 ప్రాంగణంలో చెత్త పేరుకుపోయింది. ఒకవైపు స్వర్ణాంధ్ర – స్వచ్ఛ విశాఖ అంటూ భారీ ఎత్తున ప్రచారాలు చేస్తున్నారు. అవి కేవలం ప్రచారాలకే తప్ప ప్రయోజనం లేకుండా పోతుందని చెప్పడానికి ఈ చిత్రమే సాక్ష్యం. ఈ సచివాలయం ప్రాంగణంలో ఉన్న గోడపై మహాత్ముని చిత్రం పెయింటింగ్‌తో స్వచ్ఛ భారత్ అనే నినాదాలు రాశారు. కానీ ఆ మహాత్ముని వద్దే చెత్త తొలగించలేదు. ఇక్కడికి వచ్చిన పలువురు దీనిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇటుక బట్టీల్లో బాల్యం బుగ్గి

- వలస కార్మికుల పిల్లలకు కానరాని వసతులు
- విద్య, అంగన్‌వాడీ, వైద్య సేవలు దూరం

బోని శివారులో మూతపడిన మద్ది ఒడిశా బాలల పాఠశాల



గతంలో ఒడిశా మాధ్యమంలో చదువు

గతంలో ఇటుక బట్టీల యజమానులు తమ వద్ద పనికి వచ్చే వారి పిల్లలకు గతంలో చదువులు చెప్పించేవారు. ఒడిశా నుంచి డబ్బులు ఇచ్చి ఉపాధ్యాయులను రప్పించి బట్టీల సమీపంలో వసతులు కల్పించి, పాఠాలు నేర్పించేవారు. ప్రస్తుతం ఇలాంటి వసతులు ఈ మూడు మండలాలలో ఎక్కడా కనిపించడం లేదు.



పద్మనాభం మండలం బట్టీలలో చిన్నారుల మట్టి కష్టం



పద్మనాభం మండలంలో బట్టీల వద్ద బడి ఈడు బాలలు

పిల్లలు ఎండలో తిరిగితే ఆరోగ్యం పాడవుతుందని పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. కానీ ఈ పిల్లలకు ఒంటిపూట బడులంటే తెలియదు. సున్నితమైన వారి బాల్యం మట్టిలోనే కలిసిపోతోంది. పనుల కోసం వలస వచ్చి ఇటుకబట్టీలలో పనులు చేసే కూలీల పిల్లల జీవితాలు ఆ బట్టీల వద్దే మగ్గిపోతున్నాయి. బడి.. అంగన్‌వాడీ అంటే ఏమిటో కూడా తెలియదు. జలుబు, జ్వరం వస్తే గ్రామీణ వైద్యుడే వీరికి దిక్కు. మట్టి, బూడిద, బొగ్గులలోనే వారి బాల్యం మగ్గిపోతుంది.

తగరపువలస: ఇటుక బట్టీల్లో బాల్యం మసిబారుతోంది. భీమిలి నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మూడు మండలాలలో కలిపి 500కు పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ఈ బట్టీలలో అంగన్‌వాడీలకు వెళ్లే చిన్నారుల నుంచి బడిఈడు వరకు 10వేల మందికి పైగా పిల్లలు ఉంటారు. ఏటా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఒడిశా రాష్ట్రం నుంచి భార్యాపిల్లలతో బట్టీలకు చేరుకుంటారు. వేకువజామున 4 గంటలకు బట్టీలకు చేరుకుని యంత్రాలతో మట్టి కలపడం, ఇటుక పట్టడం, ఎండబెట్టడం, బట్టీలు పేర్చడం వంటి పనులలో నిమగ్నమై ఉంటారు. ఒక్కోసారి ట్రాక్టర్లు, జేసీబీలపై కూడా బాలబాలికలు ప్రమాదకరమైన పనులు చేస్తుంటారు. మరుసటి ఏడాది వర్షాలు ప్రారంభమయ్యేవరకు వీరికి ఇక్కడ పని ఉంటుంది. బట్టీలను ఆనుకుని నిర్మించే తాటాకులు, రేకుల ఇళ్లలోనే వారికి ఇటుకల తయారీ సీజన్ గడిచిపోతుంది. పనిచేయగలిగే బాలలైతే తల్లిదండ్రులకు సాయంగా అందుబాటులో ఉంటారు. లేదంటే తాత్కాలిక నివాసాలకే పరిమితం అవుతారు. సాధారణంగా ఐదేళ్లు నిండిన బాలలు తల్లిదండ్రులకు పనిలో తోడుగా ఉంటూ చదువులకు దూరమవుతున్నారు. ఇంతా చేసి కుటుంబం మొత్తం రెక్కలుముక్కలు చేసుకుని వెయ్యి ఇటుకలు పడితే వచ్చేది వెయ్యి రూపాయలే.

బతుకు భారం

బట్టీలలో వయసుకు మించి పనులు చేస్తూ అక్కడే కాలకృత్యాలు, ఆహారం వంటి కారణాలతో బాల్యంలోనే బతుకును భారం చేసుకుంటున్నారు. మద్యం, గుట్కా తదితర వ్యసనపరులైన తల్లిదండ్రుల నుంచి ఈ వ్యసనాలు త్వరగా అలవడుతున్నాయి. ఒక్కోసారి తమ గ్రామాలలో తల్లిదండ్రులను చూసుకునేవారు లేకపోతే వాళ్లు కూడా ఇటుక బట్టీల వద్దకు వలస వచ్చి పిల్లలను సాకుతున్న పరిస్థితి.

కన్నెత్తి చూడని అధికారులు

బడి ఈడు పిల్లల బాల్యాన్ని తమ మండల పరిధిలో బట్టీల యజమాన్యాలు బుగ్గిపాలు చేస్తున్నా అందుబాటులో ఉండే సహాయ కార్మికశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రత్యేకంగా 30 మంది బడి ఈడు పిల్లలు ఉంటే పాఠశాల, 10 మంది చిన్నారులు అంటే అంగన్‌వాడీ వసతులు అందించవలసి ఉన్నా, ఇక్కడి అధికారులు వారిని పరాయి రాష్ట్రం వారిగానే చూస్తున్నారు. నిత్యం కాలుతున్న బట్టీల మధ్య సమిధలుగా మారుతున్న బాలలను రక్షించడానికి అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదు. దీంతో నిండా పదేళ్లయినా రాకముందే పచ్చని బాల్యం మసిబారి వ్యాధులకు గురవుతున్నారు.



ఇటుకబట్టీల వద్ద బిక్కుబిక్కుమంటూ ఇలా ఎందరో బాలలు



బట్టీలలో మసిబారుతున్న బాలుడు

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా



బంగ్లామెట్ట యూటర్న్ వద్ద బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

తగరపువలస: స్థానిక జాతీయరహదారిపై వెంకటేశ్వరమెట్ట నుంచి పోలీస్ చెక్‌పోస్టు దిగువగా బంగ్లామెట్ట మార్గంలో కర్రలతోడులో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ మంగళవారం బోల్తా పడింది. దీంతో ఈ కూడలిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విజయనగరం, శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే వాహనాలు తగరపువలస వైపు తిరిగి బంగ్లామెట్ట వైపు వెళ్లేచోట ప్రమాదకరమైన మలుపు ఉంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు కుదుపులకు గురవడం, ఆగిపోవడం, వాలిపోవడం జరుగుతుంటాయి. ఏమాత్రం వేగంగా వచ్చినా వాహనాలు అదుపు తప్పి, బోల్తా పడటం ఖాయం. గత నెలరోజుల్లో ఇక్కడే మూడు వాహనాలు అదుపు తప్పి పడిపోయినా, అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. అధికారులు స్పందించి, ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు వీలుగా మార్గాన్ని సరిచేసి విస్తరించాలని కోరుతున్నారు.

మెడికల్ సర్టిఫికెట్‌కు డబ్బులు డిమాండ్

స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ వద్ద విద్యార్థుల నిరసన



అసంపూర్తిగా ఇచ్చిన సర్టిఫికెట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, సిటూ నాయకుడు

మధురవాడ: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో ఆస్పత్రి వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. వివరాలివి.. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ నిమిత్తం మంగళవారం ఉదయం మధురవాడ పీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి సిబ్బంది వైద్యురాలిని కలవనీయకపోవడంతో అక్కడి నుంచి స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీకి వెళ్లారు. సర్టిఫికెట్ కావాలంటే రూ.200 నుంచి రూ.300 ఇవ్వాల్సిందేనని అక్కడి సిబ్బంది తేల్చి చెప్పడంతో ఆ విద్యార్థులు సీఐటియూ నాయకుడు రాజ్‌కుమార్ దృష్టికి విషయం తీసుకువెళ్లారు. దీంతో ఆస్పత్రికి వచ్చిన ఆయన విద్యార్థులతో కలసి నిరసన తెలిపారు. దీనిపై వైద్యురాలు పి.మానసను నిలదీయడంతో.. విషయం తమ దృష్టికి రాలేదని, ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయం తాను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లనన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీలు



గిడిజాల పంచాయతీలో ర్యాలీలో పాల్గొన్న వైస్ ఎంపీపీ పొంద్రంగి శ్రీను తదితరులు

తగరపువలస: రీ సర్వేపై ఆనందపురం మండలం గిడిజాల, కుసులవాడ, భీమిలి మండలం తాళ్లవలస, తాటితూరు పంచాయతీలలో మంగళవారం అవగాహన ర్యాలీలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో ఆయా మండలాల తహసీల్దార్లు పి.శ్యాంప్రసాద్, పి.రామారావు పాల్గొన్నారు. వారు స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ర్యాలీలు నిర్వహించిన గ్రామ పంచాయతీలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి గ్రామ సభ నిర్వహించి, రీ సర్వే వలన కలిగే ప్రయోజనాలు రైతులకు తెలియచేస్తామన్నారు. ర్యాలీల్లో డివిజనల్ సర్వే అధికారి కొండలరావు, డీటీ గోవింద, మండల సర్వేయర్ అప్పన్న, సర్పంచ్ షిణగం అప్పలరాజు, వైస్ ఎంపీపీ పొంద్రంగి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు షిణగం దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం: రీసర్వేను విజయవంతం చేయాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది పొంద్రంగి, కొవ్వాడ గ్రామాల్లో మంగళవారం ర్యాలీలు చేశారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ కె.ఆనందరావు మాట్లాడుతూ ఏప్రిల్ రెండు నుంచి ఈ సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్‌ఐ శ్యామల, వీఆర్వోలు పాల్గొన్నారు.

నత్తనడకన భూగర్భ విద్యుత్ పనులు



అండర్ గ్రౌండ్ విద్యుత్ వైరింగ్ పనుల కోసం తవ్విన రోడ్డు

పీఎం పాలెం: స్థానిక క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న జాతీయ రహదారి నుంచి 8వ వార్డులోని పీర్‌లెస్ కాలనీకి వెళ్లే రోడ్డులో అసంపూర్తి పనులతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీకి అండర్ విద్యుత్ కేబుల్ లైన్లు వేయడంలో భాగంగా రోడ్డుకు ఒక పక్కన కాలువ తవ్వారు. ఆ కాలవలో కేబుల్ వైర్లు అమర్చి కాలువను మరలా పూడ్చవలసి ఉంది. ఈ రోడ్డు చాలా ఇరుకుగా ఉంటుంది. అండర్ గ్రౌండ్ వైరింగ్ కోసం తవ్విన కాలువ కారణంగా ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు తప్పుకోలేని పరిస్థితి నెలకొంది.రాత్రి వేళల్లో కాలువ తవ్వగా వచ్చిన మట్టి పోగులు కారణంగా ఆ రోడ్డులో ప్రయాణించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, త్వరితగతిన అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వైరింగ్ పనులు పూర్తి చేయాలని, ప్రయాణాలకు మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థినులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



వాటర్ బాటిళ్లతో చిప్పాడ హైస్కూల్ విద్యార్థినులు

తగరపువలస: నాన్హి కలి ప్రాజెక్ట్ ద్వారా (నాంది ఫౌండేషన్) ఆధ్వర్యంలో చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో 81, తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 92 మంది బాలికలకు మంగళవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వీటితో పాటు నిర్వాహకులు వారికి డ్రాయింగ్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి ఈశ్వరరావు, బుడుమూరి సోమేశ్వరరావు, తాటిపూడి రేణుక, వెంపాడ రమాదేవి, సీహెచ్ మౌనిక, ప్రధానోపాధ్యాయిని ఎంవీటీ రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మా సిబ్బందికి ముగిసిన ఎండీపీ శిక్షణ

కొమ్మాది: అరబిందో ఫార్మా లిమిటెడ్ అనుబంధ సంస్థ ఏపీ టోరియో ఫార్మా ఉద్యోగులకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎండీపీ) మంగళవారం ముగిసింది. ఆరోఅస్త పేరుతో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో భాగంగా 34 మంది మధ్యస్థాయి మేనేజర్లకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ వేళ.. వినోదం కోసం..



బీచ్ వద్ద ఏర్పాటు చేసిన వినోద సాధనాలు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి ఉత్సవాలకు సంబంధించి బీచ్ వద్ద పలు వినోద సాధనాలు సిద్ధమవుతున్నాయి. జెయింట్ వీల్స్‌తో పాటు ఇతర ఆట పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఉత్సవాలు జరగనుండగా ప్రతి రోజు ఇక్కడికి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా విశాఖ, విజయనగరం నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం రానున్నారు. ఉత్సవం జరిగే నాలుగు రోజులు ఈ ప్రాంతం ఎంతో సందడిగా ఉంటుంది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చాలామంది ఇక్కడ గడిపి వెళ్తారు.

జోరుగా పూడిక తీత పనులు

పద్మనాభం: మండలంలోని బి.ఆర్.తాళ్లవలస పంచాయతీలో డ్రైనేజీల్లో పూడికతీత పనులు కొద్ది రోజులుగా జోరుగా జరుగుతున్నాయి. బి.ఆర్.తాళ్లవలస లోనిఅన్ని వీధుల్లోని సైడు కాలువల్లో పూడుకుపోయిన చెత్తను తీస్తున్నారు. ఇప్పటికే 30 ట్రాక్టర్ల చెత్తను తొలగించారు. బొత్సపేటలోని డ్రైనేజీల్లో చెత్తను రెండు రోజుల్లో తీసి, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సర్పంచ్ చందక శ్రీను తెలిపారు.

అతిథి గృహానికి రూ.20 లక్షలు మంజూరు



శిథిలమైన జెడ్పీ అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

భీమునిపట్నం: భీమిలిలో శిథిలమైన జిల్లా పరిషత్ అతిథి గృహ భవనాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర మంగళవారం పరిశీలించారు. ఈ భవనానికి ప్రస్తుతం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్త భవనాన్ని నిర్మించాలా లేక మరమ్మతులకు పనికి వస్తుందా అన్నదాన్ని పరిశీలించి ఆ మేరకు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ రికార్డులను పరిశీలించారు, అభివృద్ధి పనుల విషయంలో జాప్యం చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, పంచాయతీ విస్తరణ అధికారి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నగదు, సరకులు అందిస్తున్న శ్రీరామ్

తగరపువలస: తాళ్లవలస పంచాయతీ యాతపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో చుక్క అప్పారావు తాటాకుల ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో, భీమిలికి చెందిన స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్ వారికి సాయం అందించారు. బాధిత కుటుంబానికి రూ. 5 వేలు, నెలకు సరిపడా బియ్యం, సరకులు అందజేశారు. ఊడికల లక్ష్మణ్, ఎం.శంకర్, కిషోర్ పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు, ఎస్సీ, అనాథ, సెమీ అనాథ పిల్లలు ఈ సీట్ల కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

త్రైతసిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

తగరపువలస: పద్మనాభం మండలం విజయరాంపురానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి విశ్వావసు నామ సంవత్సర తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం జరిగింది. భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేటలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పుడు ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, తాతినాయుడు, కమిటీ ప్రతినిధులు కె.త్రినాధరావు, జి.కృష్ణ సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో తాగునీటి సమస్యను వారం రోజుల్లో పూర్తిగా పరిష్కరించనున్నట్లు సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, దుర్గారావు తెలిపారు. ఇటీవల పెదనాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం గ్రామాలలో భారీ వాహనాలు పైపులైన్ల మీద నుంచి వెళ్లడంతో పలుచోట్ల మరమ్మతులకు గురయ్యాయన్నారు. వీటిని ఇప్పటికే గుర్తించామని, మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని సత్తెమ్మ తెలిపారు.

మ్యాట్రిమోనీ రిజిస్ట్రేషన్ల పేరుతో టోపీ

తగరపువలస: మ్యాట్రిమోనీ రిజిస్ట్రేషన్ల పేరుతో డబ్బులు గుంజి, తర్వాత నుంచి ఫోన్లు లిఫ్ట్ చేయకపోవడంతో పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పత్రికలు, సామాజిక మాధ్యమాలలో ప్రకటనలు చూసి సంప్రదించగా, రిజిస్ట్రేషన్ పేరుతో ఒక్కొక్కరి నుంచి దఫదఫాలుగా రూ.5వేలు వరకు కాజేశారు. ఇలాగే డబ్బులు కట్టి మోసపోయామని జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్ వాసులు పలువురు తెలిపారు. గుర్తింపు లేని నకిలీ మ్యాట్రిమోనీల ఆట కట్టించాలని బాధితులు కోరుతున్నారు.

రూ.లక్షలు పోసి.. నిర్లక్ష్యంగా వదిలేసి..



ప్రైవేట్ మార్కెట్ వద్ద ..



రాములమ్మ థియేటర్ వద్ద బోసిగా డివైడర్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులలో ప్రజాధనం రూ.లక్షలు కుమ్మరించి ఆధునీకీకరించిన డివైడర్లకు అర్థం లేకుండా పోయింది. స్థానిక మెయిన్‌రోడ్డులోని రాములమ్మ థియేటర్ నుంచి తాతా థియేటర్ వరకు గతంలో రెండు అడుగుల వెడల్పు అర అడుగు పొడవుతో 500 మీటర్ల మేర డివైడర్ ఉండేది. అప్పట్లో డివైడర్‌పై ఎలాంటి మొక్కలు లేకపోగా చిరు వ్యాపారులే వినియోగించుకునేవారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు సుమారు రూ.25 లక్షలు వెచ్చించి మూడు అడుగుల వెడల్పు, అడుగు పొడవుతో దీనిని ఆధునీకరించారు. అయినప్పటికీ ఈ డివైడర్‌పై ఎలాంటి మొక్కలు వేయలేదు. పైగా మళ్లీ చిరు వ్యాపారులే ఈ డివైడర్‌ను వినియోగించుకుంటున్నారు. ప్రజలకు ఉపయోగం లేని డివైడర్ల ఆధునీకరణ కేవలం అధికారులు కమీషన్లకే ఉపయోగపడిందని భీమిలి జోన్ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డివైడర్‌పై మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.